సాక్షి
రంగారెడ్డి

బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



నేను రాను బిడ్డో..

మంచాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరైన మందులు, సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసి తీరుతామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸



అందరి కృషితో లాభాలు

ఆర్టీసీ డిపోను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని ఆ సంస్థ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు కోరారు. 8లో▸

న్యూస్‌రీల్

గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగస్వాములు కావాలి

ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్



మొయినాబాద్‌లోని ఐఐటీఏలో మొక్కలు నాటుతున్న ఎంపీ సంతోష్‌కుమార్

మొయినాబాద్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగస్వాములు కావాలని రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమారు పిలుపునిచ్చారు. మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రెనింగ్ అకాడమీ (ఐఐటీఏ)లో మంగళవారం గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు. ప్రభుత్వం తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలో కోట్ల మొక్కలు నాటినట్టు గుర్తుచేశారు. నాటిన ప్రతి మొక్కనూ పరిరక్షిస్తే మానవ, జీవకోటికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి ప్రభుత్వ సంస్థతోపాటు ప్రైవేటు విద్యా సంస్థల్లో మొక్కలు నాటే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు అనీల్‌కుమార్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

మినీ అంగన్‌వాడీల అప్‌గ్రేడ్‌పై హర్షం



మంత్రి సత్యవతిరాథోడ్‌తో మినీ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

చేవెళ్ల: రాష్ట్రంలో మినీ అంగన్‌వాడీలను ప్రధాన అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్‌చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయటం హర్షణీయమని మినీ అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు పంబలి భారతి అన్నారు. మినీ అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం పలు జిల్లాల నుంచి నగరంలో మంత్రి సత్యవతిరాథోడ్, కమిషనర్ భారతిహోళికేరిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా మినీ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నట్లు తెలిపారు. స్పందించిన ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటామని చెప్పారు. మంత్రిని, కమిషనర్‌ను కలిసిన వారిలో అంగన్‌వాడీల సంఘం నాయకులు తెలుగు కృష్ణవేణి, శివమ్మ, సంధ్య, ఝాన్సీ, శంకరమ్మ, లక్ష్మి, భాగ్య తదితరులు ఉన్నారు.

షాద్‌నగర్ పట్టణ సీఐకి ఉత్తమ అవార్డు



సీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ ప్రతాప్‌లింగం

షాద్‌నగర్: జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారం విషయంలో చొరవ చూపినందుకుగాను షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్ లింగం సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ నెల 9న నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా సీఐ కృషి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీఐ ప్రతాప్‌లింగం సీపీ స్టీఫెన్ రవీంద్ర చేతుల మీదుగా ఉత్తమ అవార్డుతో పాటు, ప్రశంసా ప్రత్రం అందుకున్నారు.

నిమజ్జన స్థలం పరిశీలన

శంకర్‌పల్లి: వినాయ చవితి ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధనా రష్మి పెరుమాల్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని పత్తేపురం మూసీ వాగు వద్ద వినాయక నిమజ్జన స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్, మున్సిపల్ సిబ్బందికి సూచించారు. గణేశ్ ఉత్సవ కమిటీలు పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నార్సింగి ఏసీపీ లక్ష్మీనారాయణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి, ఆర్‌ఐ విక్రంరెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఫార్మా ప్లాట్లు.. ఫర్ సేల్!



మీరాఖాన్‌పేటలో ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటీ హెచ్‌ఎండీఏ వెంచర్

121 గజాలకు రూ.5 లక్షలు

- 363 ఆపై గజాలకు రూ.14 లక్షలకు పైగా ధర
- అమ్మకానికి పెట్టిన లబ్ధిపొందిన రైతులు
- మీరాఖాన్‌పేటలో జోరుగా విక్రయాలు
- ఆసక్తి చూపుతున్న ఉద్యోగులు, బడా నేతలు

యాచారం: ఫార్మాసిటీ ప్లాట్లు విక్రయానికి మార్కెట్లోకి వచ్చేశాయి. యాచారం, కందుకూరు, ఆమనగల్లు, కడ్తాల్ మండలాల పరిధిలోని 19,333 ఎకరాల్లో కేసీఆర్ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తోంది. యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో 9,851 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించడానికి టీఎస్‌ఐఐసీ, రెవెన్యూ యంత్రాంగం నిర్ణయించింది. ఇందులో భాగంగా నాలుగు గ్రామాల్లో ఇప్పటికే 7,640 ఎకరాల అసైన్డ్, పట్టా భూమిని సేకరించింది. అసైన్డ్ భూమికి ఎకరాకు రూ.8 లక్షలు, పట్టా భూమికి రూ.16 లక్షలు (మొదట్లో రూ.12.50 లక్షలే) పరిహారం అందజేసింది. అసైన్డ్ భూముల సేకరణలో సమస్యేమీ రాకపోయినా పట్టా భూముల సేకరణలో రైతుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఫార్మాసిటీకి భూములు సేకరించే గ్రామాల పక్కనే వ్యవసాయ భూముల ధరలు ఎకరాకు రూ.కోటికి పైగా పలుకుతుంటే తమ భూములకు మాత్రం ఎకరాకు రూ.16 లక్షలే ఇస్తారా అంటూ రైతులు నిరాకరించారు. ఈ నేపథ్యంలో భూములు ఇవ్వడానికి మొండికేయడం, కోర్టులను ఆశ్రయించడంతో భూసేకరణ నిలిచిపోయింది.

రైతులకు మేలు చేసేందుకే..

ఫార్మాసిటీకి భూ సేకరణ కష్టంగా మారడంతో మంత్రి సబితారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బాధిత రైతులకు ప్లాట్లు ఇచ్చే విషయమై రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో కందుకూరు మండలం మీరాఖాన్‌పేట రెవెన్యూ పరిధిలోని 600 ఎకరాలకుపైగా టీఎస్‌ఐఐసీ సేకరించిన భూమిలో హెచ్‌ఎండీఏ వెంచర్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. రూ.500 కోట్లకు పైగా నిధులతో 600కు పైగా ఎకరాల్లో అన్ని సౌకర్యాలతో కూడిన హెచ్‌ఎండీఏ వెంచర్‌ను ఏర్పాటు చేసి ఫార్మాకు భూములిచ్చిన రైతులకు ప్లాట్లు ఇచ్చేలా నిర్ణయించారు. యాచారం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాకు భూములిచ్చిన రైతులను గుర్తించారు. నాలుగు గ్రామాల్లో ఫార్మాసిటీకి అసైన్డ్, పట్టా భూములు ఇచ్చిన దాదాపు 1,500కు పైగా రైతులకు రెండు దఫాలుగా ప్లాట్లు పంపిణీ చేశారు. ఎకరా భూమికి 121 గజాల చొప్పున ప్లాటుకు సంబంధించిన సర్టిఫికెట్ ఇచ్చి బాధిత రైతులు వాటిని అమ్ముకోవచ్చని వెల్లడించారు. దసరా పండుగ లోపు సర్టిఫికెట్లు ఇచ్చిన రైతులకు మీరాఖాన్‌పేటలోని హెచ్‌ఎండీఏ వెంచర్‌లో స్థలాలను చూపించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అవసరాల పేరుతో అమ్మకం

మీరాఖాన్‌పేటలోని హెచ్‌ఎండీఏ వెంచర్ నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉండడం.. ప్లాట్లు ఇచ్చినా స్థలాలు చూపకపోవడం.. మరోవైపు వచ్చే ఎన్నికల్లో ఏం జరుగుతుందోననే ఆందోళనతో రైతులు ఆయా ప్లాట్లను విక్రయానికి పెట్టారు. 121 గజాల ప్లాటుకు రూ.5 లక్షలు, 363 గజాల ప్లాటుకు రూ.14 లక్షలు, ఇంకా 500 గజాల ప్లాటు ఉంటే రూ.25 లక్షల చొప్పున విక్రయిస్తున్నారు. అత్యావసరాలు, వ్యక్తిగత ఖర్చులు, పిల్లల పెళ్లిళ్ల కోసం రైతులు ప్రభుత్వం తమకిచ్చిన ప్లాట్లను విక్రయిస్తున్నారు. ప్రస్తుతం సగం ధర చెల్లించి, మీరాఖాన్‌పేట హెచ్‌ఎండీఏ వెంచర్‌లో స్థలాలు చూపించిన తర్వాత మిగితా డబ్బులు ఇస్తామని అగ్రిమెంట్లు రాసుకుంటున్నారు. కందుకూరు- యాచారం మండలాల సరిహద్దులో ప్రముఖ రియల్ వ్యాపార సంస్థలు కంపెనీలు, విల్లాలు, ప్రత్యేక గృహాలు ఏర్పాటు చేస్తున్నాయి. భవిష్యత్తులో ఈ ప్రాంతంలోని ప్లాట్లు బంగారంలా మారే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ఉద్యోగులు, బడానేతలు, రాజకీయ, వ్యాపారవేత్తలు ఫార్మా ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇలా ఆయా గ్రామాల్లో ఇప్పటికే 250కు పైగా ప్లాట్లు విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది.

“ రైతుల ఇష్టాలను కాదనలేం



ఆర్థికంగా ప్రగతి సాధించాలనే ఉద్దేశంతో ఫార్మాకు భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్లాట్లను ఇచ్చింది. భవిష్యత్తులో మీర్‌ఖాన్‌పేట హెచ్‌ఎండీఏ వెంచర్‌లోని ప్లాట్లకు ఊహించని విధంగా ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఫార్మాసిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతం ప్రపంచస్థాయి గుర్తింపు పొందుతుంది. రైతుల ఇష్టాలను కాదనలేం. కానీ అమ్మి నష్టపోవద్దని సూచిస్తున్నాం.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

దసరాలోపు స్థలాలు



ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులకు పరిహారంతో పాటు అదనంగా ఎకరాకు 121 గజం ప్లాటు ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఒప్పించాం. మీరాఖాన్‌పేటలోని హెచ్‌ఎండీఏ వెంచర్‌లో అన్ని సౌకర్యాలతో ప్లాట్లు ఇస్తున్నాం. ఇప్పటికే 60 శాతం మంది లబ్ధిదారులకు కేటాయించాం. దసరాలోపు ప్లాట్లకు నంబర్లు వేసి స్థలాలు చూపిస్తాం. భవిష్యత్తులో వీటికి మంచి డిమాండ్ ఉంటుంది. రైతులు ఇప్పుడే అమ్ముకోవద్దు.

– మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇబ్రహీంపట్నం

పాలమూరు- రంగారెడ్డితో మేలు

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో మన ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని విద్యాశాఖా మంత్రి సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట ఎస్‌వైఆర్ గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుతో జిల్లాలోని చేవెళ్ల, షాద్‌నగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా జరిగే పాలమూరు ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. 17న కృష్ణానది జలాలను తెచ్చి జిల్లాలోని అన్ని గ్రామ దేవతల పాదాలు కడగాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం కుల, మతాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయిస్తుంటే ప్రతిపక్ష పార్టీలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి వీటిని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మీర్‌పేట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అరవింద్‌శర్మ, అర్కల కామేష్‌రెడ్డి, పెండ్యాల నగేష్, దిండు భూపేష్ గౌడ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

అంగన్‌వాడీ పనితీరు భేష్

తుమ్మలూరు కేంద్రాన్ని సందర్శించిన విదేశీయులు

మహేశ్వరం: మండల పరిధిలోని తుమ్మలూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం విదేశీయులు సందర్శించారు. కేంద్రంలో అందిస్తున్న సేవల గురించి విదేశీ ప్రతినిధులు ఐసీడీఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో 0–6 సంవత్సరాలలోపు పిల్లలను చేర్చుకొని వారికి పౌష్టికాహారంతో కూడిన ఆహారం అందించి, ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని మహేశ్వరం సీడీపీఏ షబానా విదేశీ ప్రతినిధులకు తెలియజేశారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు, కిశోరా బాలికలకు నిత్యం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం గురించి తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ బాగుందని విదేశీయులు అభినందించారు. తల్లులు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికలతో విదేశీయులు మాట్లాడారు. ఆలనా- పాలనా వీడియోలు చూపించి అవి తల్లులకు ఏవిధంగా పయోగపడుతున్నాయో తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారి శిల్ప, మహేశ్వరం సీడీపీఓ షబానా, తుమ్మలూరు సర్పంచ్ మద్ది సురేఖారెడ్డి, ఉప సర్పంచ్ కె.శ్రీహరి ముదిరాజ్, మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న విదేశీయులు

పర్యావరణానికి ముప్పు కలగొద్దు

- మైనింగ్ కంపెనీకి అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణ
- అభిప్రాయాలు వ్యక్తం చేసిన పర్యావరణవేత్తలు, స్థానికులు

కడ్తాల్: నార్లకుంట పంచాయతీ పరిధిలో కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న మెస్సర్స్ ఎండీఆర్ మైనింగ్ కంపెనీ పర్యావరణ అనుమతులపై మంగళవారం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. పంచాయతీ సమీపంలోని సర్వేనంబర్ 06లో 19.415 హెక్టార్లలో మెస్సర్స్ ఎండీఆర్ మైన్స్ బిల్డింగ్ అండ్ రోడ్‌మెటల్ క్రషర్‌ప్లాంట్ రెన్యూవల్ కోసం నిర్వాహకులు ఇటీవల మైనింగ్ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మైనింగ్ ప్లాంట్ వద్ద స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ వెంకటనర్సు ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. పలువురు పర్యావరణవేత్తలు, వివిధ ఎన్‌జీవో సంఘాల నాయకులతో పాటు గోవిందాయిపల్లితండా, మైసిగండి, నార్లకుంటతండా, గడ్డమీదితండా, కర్కల్‌పహాడ్ గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, రైతులు, రైతు కూలీలు, యువకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పరిసరా గ్రామాల్లో మైనింగ్ కంపెనీ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టాలని, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, మైనింగ్ పరిసర గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా చూడాలని కోరారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి అభిప్రాయాలను పూర్తిగా విన్నామని నివేదిక రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, సర్పంచ్‌లు తులసీరాం, దేవా, ఉప సర్పంచ్ రాజరాం తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న యువకుడు

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

కలెక్టర్ హరీశ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభాలు బాగుంటాయని కలెక్టర్ హరీశ్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖ, వాల్యూ ఆయిల్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 5,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. రైతులు సంప్రదాయ పంటలకు బదులు అధిక లాభాలు అందించే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి మళ్లించాలని సూచించారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటితే నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభం అవుతుందని, 30 ఏళ్ల వరకు ఆదాయాన్ని ఆర్జించి పెడతాయన్నారు. ప్రభుత్వం సైతం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తోందని, పెద్ద ఎత్తున రాయితీలను అందిస్తోందన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించి పంటలు సాగు చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సునందారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ఆయిల్ కంపెనీ ప్రతినిధులు డాక్టర్ బీఎస్ రావు, రఘు, ప్రీతి, రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరీశ్

స్ట్రాంగ్ రూంల ఏర్పాటుకు పరిశీలన

ఇబ్రహీంపట్నం: పోలింగ్ బాక్స్‌ల భద్రత కోసం స్ట్రాంగ్ రూంల ఏర్పాటుకు సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలను మంగళవారం కలెక్టర్ హరీశ్ పరిశీలించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ జరిగిన అనంతరం బాక్స్‌లను ఎక్కడ భద్రపరచాలి, కౌంటింగ్‌కు అనువుగా ఉండే ప్రాంతాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ మేరకు పోచారం, ఉప్పరిగూడ గ్రామాల సమీపంలో ఉన్న సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించి గదులు, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కళాశాలలోని సౌకర్యాల గురించి ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఇబ్రహీంపట్నం, కందుకూరు ఆర్డీవోలు అనంతరెడ్డి, సురేష్‌కుమార్, తహసీల్దార్ ఎండీ అన్వర్ ఉన్నారు.

కోరిక తీర్చలేదని కొట్టి చంపాడు

- ఫామ్‌హౌస్‌లో మహిళ మృతదేహం కేసును ఛేదించిన పోలీసులు
- వాచ్‌మన్, అతడి భార్య అరెస్ట్, రిమాండ్
- మృతురాలిది వికారాబాద్ జిల్లా మద్గుల్ చిట్టెంపల్లి
- వివరాలు వెల్లడించిన చేవెళ్ల సీఐ

చేవెళ్ల: మహిళను హత్యచేసి పామ్‌హౌస్‌లో పాతిపెట్టిన కేసును పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం చేవెళ్ల పీఎస్‌లో సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐ వీరబ్రహ్మం వెల్లడించారు. స్థానికుడైన కనకమామిడి మల్లారెడ్డికి చెందిన చేవెళ్లలోని ఫామ్‌హౌస్‌లో గుర్తు తెలియని మహిళను చంపి, పాతిపెట్టినట్లు ఈ నెల 10న వెలుగు చూసిన ఘటన కలకలం రేపింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు, క్లూస్ టీమ్ సభ్యులు వివరాలు సేకరించారు. అనంతరం కేసు దర్యాప్తు చేపట్టగా.. హతురాలు వికారాబాద్ జిల్లా మద్గుల్ చిట్టెంపల్లి గ్రామానికి చెందిన కాశ మైసమ్మ అలియాస్ శివనీల (28)గా గుర్తించారు.

ఏం జరిగిందంటే..

మృతురాలు పది రోజుల కిత్రం చేవెళ్లకు వచ్చి కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో ఆమెకు సంపత్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇతను ఐదేళ్లుగా పట్టణంలోనే ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఒంటరిగా ఉంటున్న సంపత్, శివనీల భార్యాభర్తల్లా కలిసి ఉంటూ, పనిచేసుకుందామని నిర్ణయించుకున్నారు. ఇదే విషయమై ఈనెల 7న మొయినాబాద్‌లోని కల్లు దుకాణంలో కూర్చుని మాట్లాడుకుంటుండగా.. చేవెళ్లలోని ఫామ్‌హౌస్‌లో పనిచేస్తున్న వాచ్‌మన్ సత్తయ్య, ఇతని భార్య కల్పన కల్లు తాగుతూ.. వీరితో మాటలు కలిపారు. పరస్పర పరిచయాలు పూర్తయిన తర్వాత తాము పని చేస్తున్న ఫామ్‌హౌస్‌లోనే మీకు కూడా పని ఇప్పిస్తామని సత్తయ్య దంపతులు చెప్పారు. ఇందుకు సంపత్, శివనీల సరే అనడంతో నలుగురూ కలిసి చేవెళ్లలోని ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు.

హత్యకు దారితీసిన దురాలోచన

నలుగురూ కలిసి సాయంత్రం వరకూ బాగా మద్యం తాగారు. అంతకు ముందే కల్లు తాగి ఉండటంతో సత్తయ్య భార్య కల్పన నిద్రలోకి జారుకుంది. మిగిలిన ముగ్గురు కలిసి ఉండగా సత్తయ్య మనసులో దురాలోచన మెదిలింది. సంపత్‌కు రూ.500 ఇచ్చి మద్యం తీసుకురమ్మని పంపించాడు. అనంతరం శివనీల ఒంటరిగా ఉండటంతో తన కోరిక తీర్చాలని అడిగాడు. దీనికి ఆమె ఒప్పుకోలేదు. ఎంత బలవంతం చేసినా ససేమిరా అనడంతో ఇద్దరి మధ్య పెనుగులాట జరిగింది. దీంతో బాధితురాలు బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. సత్తయ్య కర్ర తీసుకుని ఆమె తలపై బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన శివనీల గట్టిగా కేకలు వేసింది. దీంతో ఎక్కడ తన భార్య లేస్తుందోనని భావించి మరోసారి కర్రతో తలపై బాదాడు. అనంతరం ఓ వస్త్రాన్ని మెడకు బిగించి హత్యచేశాడు.

పుస్తెలతాడు చోరీ..

మద్యం తీసుకుని వస్తున్న సంపత్‌కు ఎదురెళ్లిన సత్తయ్య.. శివనీల తనతో గొడవ పెట్టుకుని వెళ్లిపోయిందని, నీకు కూడా ఇక్కడ పని లేదని చెప్పి పంపించేశాడు. తిరిగివచ్చిన అనంతరం శివనీల మెడలోని బంగారు పుస్తెల తాడును తీసుకుని, ఫామ్‌హౌస్ పక్కనున్న బండలను తొలగించి మృతదేహాన్ని పాతిపెట్టాడు. ఎప్పటిలాగే పైన బండ రాళ్లు కప్పేశాడు. మరుసటి రోజు ఉదయాన్నే నిద్రలేచిన కల్పన.. సంపత్, శివనీల వివరాలను ఆరా తీయగా.. రాత్రే వెళ్లిపోయారని నమ్మబలికాడు. కానీ ఫామ్‌హౌస్ పక్కన గొయ్యి తవ్వినట్లు, బండలు తొలగించినట్లు ఆనవాళ్లను గుర్తించిన ఆమె నిలదీయగా.. అసలు విషయం బయటపెట్టాడు.

అన్నీ సర్దుకుని..

ఇక్కడే ఉంటే పోలీసులకు పట్టుబడతామని భయపడిన కల్పన, సత్తయ్య.. ఈ నెల 8న పామ్‌హౌస్ యజమానికి ఫోన్ చేశారు. తమ స్వగ్రామమైన మైలార్‌దేవరపల్లిలో గొడవలు జరుగుతున్నాయని, ఇంటికి వెళ్లి వస్తామని అడిగారు. అప్పటికే పలుమార్లు వీరితో ఇబ్బంది పడిన ఆయన ఇక మీరు రానవసరం లేదు వెళ్లిపోండి అని చెప్పారు. ఇదే అదనుగా సామాన్లు సర్దుకుని వారు వెళ్లిపోయారు. శివనీల మెడలో నుంచి దొంగిలించిన పుస్తెల తాడు తన భార్యదిగా చెప్పి.. ఓ బంగారం దుకాణంలో తాకట్టు పెట్టి రూ.5 వేలు తీసుకున్నారు.



మహిళ హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐ వీరబ్రహ్మం

విషయం పొక్కిందిలా..

మల్లారెడ్డి తన స్నేహితుడు, డ్రైవర్ కలిసి 10న ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. పైపులైన్ పనిచేయటం లేదని వెళ్లి పరిశీలిస్తూ బండల కింద తవ్వారు. మహిళ మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. యజమాని ఫిర్యాదుతో సత్తయ్య, కల్పనను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పుస్తెలతాడును తాకట్టు పెట్టిన రశీదు, హత్యకు ఉపయోగించిన కర్ర, గడ్డపార, పారలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే యాదయ్య



కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి: సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నారు. గ్రామాల్లో నూతనంగా పంచాయతీ భవనాలు, వైకుంఠధామాలను నిర్మించారన్నారు. అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, తహసీల్దార్ సురేందర్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గోపాల్, మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్ ఖన్నా, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేను రాను బిడ్డో.. సర్కార్ దవాఖానకు

- మంచాల పీహెచ్‌సీలో కనీస సదుపాయాలు కరువు
- అత్యవసర సమయాల్లోనూ సూదులు, మందులు ఉండని వైనం
- ఇబ్బందులు పడుతున్న రోగులు

మంచాల: ఆ దవాఖానాలో సూది ఉంటే.. మందు ఉండదు... మందు ఉంటే సూది ఉండదు. సరైన సదుపాయాలు లేకపోవడంతో రోగులు నిరాశగా వెనుతిరిగిపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మంచాల మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీలకన్నీ కలిపి ఆరుట్ల, మంచాల గ్రామాల్లో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంచాల మండల కేంద్రం కావడంతో ఎక్కువగా ప్రజలు ఇక్కడి పీహెచ్‌సీకి రావడం జరుగుతుంది. నిత్యం 60 నుంచి 80 మంది వరకు రోగులు ఆస్పత్రికి వైద్యకోసం వస్తుంటారు. ఈ పీహెసీలో మూడు నెలలుగా బీపీ మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నాలుగు రోజులుగా దూది, బ్యాండేజీకి కట్టె క్లాత్ లేదు. గాయాలపాలై వైద్యశాలకు వచ్చిన రోగులకు దూది లేదని, పట్టీ కట్టడానికి ఉపయోగించే గాజు కాటన్ లేదని పంపిస్తున్నారు. కనీసం ఫస్ట్ ఎయిడ్ కూడా చేయలేని స్థితిలో ఆస్పత్రి ఉందంటే పరిస్థితి ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పీహెచ్‌సీలో అన్నిరకాల మందులు, వసతులు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయంపై వైద్యశాల సిబ్బంది సతీష్‌ను వివరణ కోరగా జిల్లా కార్యాలయం నుంచి మందుల స్టాక్ పంపించాలని లెటర్ పంపించామన్నారు.



మంచాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బీపీ గోలీలు కూడా లేవు



మంచాల ప్రభుత్వ వైద్యశాలకు వచ్చె రోగులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మూడునెలల క్రితం బీపీ గోలీలు లేవని, పైనుంచి రావడం లేదని రోగులను తిప్పి పంపించారు. ఇప్పుడు వైద్యశాలలో దూది, బ్యాండేజ్ క్లాత్ లేదని రోగులను పంపించేస్తున్నారు. – బాలరాజ్, మంచాల

తిప్పి పంపుతున్నారు



వ్యవసాయ పొలం వద్ద గాజుముక్క తెగి కాలుకు గాయం అయ్యింది. రక్తం తీవ్రంగా కారుతుండటంతో వైద్యం నిమిత్తం మంచాల ప్రాథమిక వైద్యశాలకు వెళ్లాను. అయితే ఆస్పత్రిలో దూది, బ్యాండేజ్ కాటన్ లేదని తిప్పి పంపించారు. మెరుగైన వైద్యం అందించాలి. – శ్రీనివాస్ గౌడ్, మంచాల

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

కందుకూరు: వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, పీస్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గణేష్ మండపాల ఏర్పాటు దగ్గర నుంచి నిమజ్జనం వరకు మండపాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. తప్పనిసరిగా మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలన్నారు. డీజేకు అనుమతులు లేవన్నారు. రాత్రి పదిగంటల తర్వాత మైక్‌లు బంద్ చేయాల్సిందేనన్నారు. గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎస్ఐలు శ్రావణ్, నరేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి..

మంచాల: గణేశ్ మండపాల ఏర్పాటు విషయంలో ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మంచాల మండల కేంద్రంలో మంచాల సీఐ కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి గణేశ్ మండపాల ఆర్గనైజర్ల సమావేశానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రతి వినాయక మండపం దగ్గర సీసీ కెమెరాను ఏర్పాటు చేయాలన్నారు. డీజేలు నిషేధమన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా రోడ్ల మీద మండపాలు ఎట్టి పరిస్థితిలో ఏర్పాటు చేయవద్దని తెలిపారు.ఎక్కడ మండపాలు ఏర్పాటు చేసిన తప్పక స్థానిక పోలిసుల అనుమతి తప్పక తీసుకోవాలన్నారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రతలు తప్పక తీసుకోవాలన్నారు. యువత, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో వినాయక ఉత్సవాల నిర్వహణకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఉత్సవాల పేరుతో ఇతరులను ఇబ్బంది పెట్టరాదన్నారు. ప్రముఖ మోటివేషన్ కృష్ణచైతన్యరెడ్డితో యువతకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సీఐ రామకృష్ణ, మంచాల ఎస్ఐ రవినాయక్, ప్రజాప్రతినిధులు ,యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



శివకుమార్ (ఫైల్)

పహాడీషరీఫ్: బోనాల జాతర చిత్రీకరణకు వెళ్లొస్తానని ఇంటినుంచి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపిన వివరాలు.. రంగనాయకుల కాలనీకి చెందిన జంగయ్య.. కుమారుడు శివకుమార్(19) జూలై 16న అతని స్నేహితుడి వద్ద కెమెరా తీసుకొని హైదరాబాద్‌లో జరిగే బోనాల ఉత్సవాల చిత్రీకరణకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చిన అతడు 18వ తేదీన కెమెరా ఇచ్చేందుకు తన స్నేహితుడి వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతడి ఫోన్ నంబర్ స్విచ్ఛాఫ్ ఉండటంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు సాధ్యమైన ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లోగాని సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో ముందుకు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



షాద్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

షాద్‌నగర్: తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని నాయకులు ప్రజా సమస్యలపై పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీను అధ్యక్షతన మంగళవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సభను నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జంగయ్య మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు, వెట్టిచాకిరీ, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు చేసిందని అన్నారు. నిజాం సర్కార్‌ను, రజాకార్ల జాగిర్దార్లను తరిమికొట్టేందుకు సాయుధ పోరాటం చేశారన్నారు. ఈ పోరాటంలో ఎంతోమంది కమ్యూనిస్టు యోధులు నేలకొరిగారని అన్నారు. వారి పోరాట ఫలితం వల్లే నిజాం సర్కార్ హైదరాబాద్ సంస్థానాన్ని వదిలేసి వెళ్లిపోయారన్నారు. ప్రస్తుతం ప్రజా సమస్యల పరిష్కారం, డిమాండ్‌ల సాధనే లక్ష్యంగా నాయకులు పోరాడాలన్నారు. సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 17న హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, నాయకులు.. రామస్వామి, షకీల్, గోవింద్‌నాయక్, వెంకటేశ్, జంగయ్య, చెన్నయ్య, చంద్రబాబు, లింగంనాయక్, మైసయ్య పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల పాత్ర కీలకం..

హయత్‌నగర్: నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాముల దోపిడీలకు, పెట్టుబడి దారులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటం జరిగిందని.. పోరాటంలో కమ్యూనిస్టులు ముఖ్య పాత్ర పోషించారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి అన్నారు. కుంట్లూర్ రావినారాయణరెడ్డి కాలనీలో మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ సీపీఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వీరులు రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొయినుద్దీన్ చిత్రపటాలకు ఆయన నివాళి అర్పించారు. రంగారెడ్డి కార్యవర్గ సభ్యుడు సామిడి శేఖర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ లక్ష్మణ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేణుగోపాలచారి, నాయకులు సైదులుముదిరాజ్, నవనీత, నారాయణరెడ్డి, సక్రునాయక్, నారాయణ, నిరంజన్, భూక్యాకాంతి, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో సహా గృహిణి అదృశ్యం



బబితాదేవి (ఫైల్)

పహాడీషరీఫ్: ఓ గృహిణి ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన వినోద్ భగత్ పదేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన బబితా దేవి(28)ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరు రెండేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం తమ ఇద్దరు కుమారులు సూరజ్ కుమార్(9), కిషన్ కుమార్(7)తో కలిసి నగరంలోని జల్‌పల్లి శ్రీరాం కాలనీకి వలస వచ్చారు. ఈ నెల 4వ తేదీన భర్త బయటికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి బబిత, ఇద్దరు కుమారులు కనిపించలేదు. అమిత్‌కుమార్(23) అనే యువకుడిపై తనకు అనుమానం ఉందంటూ భర్త వినోద్ మంగళవారం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అపహరణకు గురైన సెల్‌ఫోన్ల రికవరీ

బాధితులకు అందజేత



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్: అపహరణకు గురైన 10 సెల్‌ఫోన్లను గుర్తించిన పోలీసులు వాటిని శనివారం బాధితులకు అందజేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్ తెలిపిన వివరాలు.. పోలీస్ స్టేష న్ పరిధిలోని వివిధ ప్రాంత్రా ల్లో సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయన్న ఫిర్యాదులు రావడంతో కేసు నమోదు చేసుకుని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అపహరణకు గురైన 10 సెల్‌ఫోన్ల ఆచూకీని గుర్తించి వాటిని బాధితులకు వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి చేతుల మీదుగా సీఐ మన్మోహన్, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డిలతో కలిసి మంగళవా రం అందజేశారు. పోయిన సెల్‌ఫోన్లను తమకు అందజేసిన పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లు రికవరీ చేసిన కానిస్టేబుల్ సాయిక్రిష్ణను ఏసీపీ అభినందించారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే పోలీస్‌స్టేషన్‌లో వివరాల తో కూడిన ఫిర్యాదు చేసుకుని పోలీసుల సేవలను వినియోగించుకోవాలని ఏసీపీ సూచించారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి



మహిళా రోగులతో మాట్లాడుతున్న జయలక్ష్మి

షాద్‌నగర్ రూరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. ఆరోగ్య మహిళా ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి మహిళారోగితో మాట్లాడారు. మహిళలకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్నపాటి అనారోగ్యానికి గురైనా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో లేని పరీక్షల కోసం రక్తనమూనాలను సేకరించి కొండాపూర్ ఆస్పత్రికి పంపించడం జరుగుతుందని అన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా 60మంది మహిళలకన్నా ఎక్కువ మందికి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రవంతి, తబస్సుమ్, ప్రవీణ, సంధ్య, కిరణ్మయి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, రమ, ఫార్మసిస్టు ఉదయ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాల సంక్షేమం



షాదీఖానా పనులను ప్రారంభిస్తున్న ఎమెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని రైతువేదిక భవనంలో మంగళవారం 29మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం స్థానిక జామ మసీదులో రూ.4 లక్షలతో చేపట్టే ఆధునీకరణ పనులు, షాదీఖానా వద్ద రూ.5 లక్షలతో చేపట్టే పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు రైతువేదికలో జరిగిన సభలో ఎమెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని చెప్పారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఆమనగల్లు పట్టణంలో రూ.17.50 కోట్లతో 50 పడకల ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. వేరే రాష్ట్రాలు తెలంగాణ పథకాలను ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించి సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలోపేతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రాధమ్మ, తహసీల్దార్ లలిత, మున్సిపల్ కౌన్సిలర్ యాదమ్మ, శ్రీశైలం, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, జామై మసీదు కమిటీ అధ్యక్షుడు మాసూం, నాయకులు సయ్యద్ ఖలీల్, వెంకటయ్య, శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషితోనే డిపోకు లాభాలు

ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు



ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఇబ్రహీంపట్నం: ఇప్పటికే లాభాల బాటలో ఉన్న ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని ఆ సంస్థ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వి.వెంకటేశ్వర్లు కోరారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిపోను నష్టాల్లో నుంచి లాభాల బాటలోకి తీసుకువచ్చిన అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులను అభినందించారు. రానున్న రోజుల్లో డిపో అభివృద్ధి పథంలో దూసుకుపోయేందుకు సిబ్బంది కలిసికట్టుగా పాటుపడాలాన్నరు. ఆగస్టు–2023 నెలలో అత్యధిక ఆదాయాన్ని డిపోకు సమకూర్చిన కండక్టర్లకు ప్రోత్సాహక బహుమతి(నగదు)ని ఈసందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎం.జగన్, డీఎం శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ ఇంజనీర్ సత్తయ్య ఉన్నారు.

మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

మహేశ్వరం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం గడ్డపైన కాంగ్రెస్ జెండాను ఎగురవేసి తీరుతామని టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం ఎంపీపీ, బీఆర్ఎస్ సినీయర్ నాయకులు కోరుపోలు రఘుమారెడ్డి, ఆకన్‌పల్లి మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాండునాయక్.. మంగళవారం బడంగ్‌పేట్ మేయర్ పారిజాత ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, నాయకులు.. సుధీర్‌రెడ్డి, కృష్ణానాయక్, జానకీరామ్, రాఘవేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు